

సాహిత్యంలో ప్రజ్ఞావంతులు 'పుట్టపర్తి' : కలెక్టర్

కడప : ఆధునికాంధ్ర సాహిత్యంలో అనితర సాధ్యమైన ప్రజ్ఞావంతులు పుట్టపర్తి నారాయణాచార్యులని కలెక్టర్ విజయ్ రామరాజు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో పుట్టపర్తి నారాయణాచార్యుల జయంతి వేడులకు నిర్వహించారు. 14 భాషలు తెలిసిన బహుభాషా కోవిధులని కొనియాడారు. భారత ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి పద్మశ్రీ ఇచ్చి గౌరవించిందని చెప్పారు. కార్యక్రమానికి ముందుగా పుట్టపర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాలులర్పించారు. **సిపిబ్రౌన్ గ్రంథాలయంలో..** యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మంగళవారం ఉదయం డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యుల 110వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి ముందుగా డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు.

'పది'పై ప్రత్యేక గురి



టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు యాక్షన్ ప్లాన్‌ను జిల్లా విద్యాశాఖ అమలు చేస్తోంది. సమ్మేటివ్, ఫార్మేటివ్ అసెస్మెంట్‌తోపాటు వినూత్నంగా మోటివేషనల్ ప్రోగ్రామ్స్ నిర్వహణతో విద్యార్థుల్లో మనోబలాన్ని పెంపొందించే ప్రయత్నం బాగా ఉపకరించనుందనే విశ్వాసం తొణికలాడుతోంది. పది పరీక్షలు యువత భవితకు పునాధిగా మారిన నేపథ్యంలో పబ్లిక్ పరీక్షలనే భయాన్ని పోగొట్టేందుకు వినూత్నరీతిలో మోటివేషనల్ ప్రోగ్రామ్స్ నిర్వహణ ద్వారా కెరీర్ గైడెన్స్‌కు సంబంధించిన అవగాహన కల్పించడం ప్రోత్సాహకర వాతావరణాన్ని నెలకొల్పినట్లు విద్యాశాఖ పేర్కొంటోంది. కలెక్టర్ పర్యవేక్షణలో నెలకు రెండు దఫాలుగా సమీక్షించడం, డిసిఎబి ద్వారా మోడల్ ఎగ్జామినేషన్ నిర్వహణ ద్వారా విద్యార్థుల సన్నద్ధతను పరిశీలన చేయడం, అనంతరం విద్యార్థులను ఎ, బి, సి, డి కేటగిరీలుగా విభజించి సబ్జెక్టు నిపుణులతో అదనపు తరగతులు నిర్వహణ, విద్యార్థుల స్టడీ పరిశీలన నిమిత్తం నైట్‌విజన్ నిర్వహణ ద్వారా 100 శాతం ఫలితాల సాధనకు ప్రత్యేక కసరత్తు చేసినట్లు పేర్కొంటున్న వైనంపై కథనం.

- సమ్మేటివ్, ఫార్మేటివ్ పరీక్షలతో సన్నద్ధం
- డిసిఎబి ద్వారా మోడల్ పరీక్షల నిర్వహణ
- అదనపు తరగతులు, నైట్ విజన్‌తో ప్రత్యేక ప్రణాళిక
- సి, డి కేటగిరీల విద్యార్థులకు అదనపు తరగతులు
- ఎంఇఒలు, సబ్జెక్టు ఉపాధ్యాయుల బృందాలు ఏర్పాటు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో 2022-23 సంవత్సరంలో టెన్త్ పబ్లిక్ పరీక్షలకు 27,211 మంది హాజరు కానున్నారు. రాష్ట్ర విద్యా శాఖ వచ్చే నెల మూడు నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికను రూపకల్పన చేసింది. కలెక్టర్ నెలకు రెండు దఫాలుగా పది ప్రణాళిక అమలును సమీక్షించడం, రెండు దఫాల పునశ్చరణ ప్రక్రియల పరిశీలన, డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా సమ్మేటివ్, ఫార్మేటివ్ ఎగ్జామ్స్ ఫలితాలను సమీక్షించడం ద్వారా టెన్త్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధత చేయడంలో సలహాలు, సూచనల చేశారు. అనంతరం డిసిఎబి మోడల్ ఎగ్జామినేషన్ పరీక్షల ఫలితాల ఆధా రంగా ఎ, బి, సి, డి కేటగిరీల విద్యార్థులకు అదనపు తరగతులను నిర్వహించడం, వారి సఫలత బాధ్యతను ఆయా సబ్జెక్టు నిపుణులకు అప్పగించడం ద్వారా గురుతరమైన బాధ్య తను అమలు చేయడం ఉత్తమ ఫలితాల సాధ నకు అనివార్య పరిస్థి తులను కలిగించినట్లు తెలుస్తోంది. ఈలెక్కన ఆరు దఫాలుగా పబ్లిక్ పరీక్షలు రాసిన అను భవాన్ని విద్యార్థుల్లో కలిగించారు. పబ్లిక్ పరీక్షలను సమర్థ వంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన మేరకు మోటివేషన్ ప్రోగ్రామ్స్, నైట్‌విజన్ వంటి కార్య క్రమాల ద్వారా విద్యార్థుల మానసిక స్థాయిని పెంపొందించడంలో సఫలీ కృతమైనట్లు విద్యాశాఖ పేర్కొంటోంది.

నైట్‌విజన్‌తో విద్యార్థుల్లో అవేర్‌నెస్

నైట్‌విజన్ విద్యార్థుల్లో అవేర్‌నెస్ పెరిగింది. ఆయా మండలాల ఎంఇఒ, హెచ్ఎం, సబ్జెక్టు నిపుణులతో కూడిన బృందం సి, డి కేటగిరీల్లో వెనుకబడిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి స్టడీ తీరుతెన్నుల పరిశీలన చేసింది. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడడం, చదువు ప్రాధాన్యతను వివరించడం, స్టడీ అవర్స్ గురించి వివరించడం వంటి పద్ధతు లను పాటించడంతో ఉత్తమ ఫలితాలు సాధ్యమని ధీమాను వ్యక్తం చేస్తోంది. నైట్‌విజన్ బృందాలకు సి, డి కేటగిరీల సఫలత బాధ్యతను మోపడం ద్వారా బృందాల నిబద్ధత పరీక్షకు నిలవనుంది. విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలనే భయాన్ని పోగొట్టడంలో భాగంగా ఎస్-ఎస్ఎ జిల్లా అధికారి విజేతల జీవితాలను పరిచయం చేయడం, కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసాన్ని కలిగించడం, ఆత్మవిశ్వాసమనే ఆయుధంతో జీవితాన్ని చూడడం వంటి లక్ష్యాలనే సామాజిక ప్రయోజనాన్ని సాధించడం వినూత్నమనే చెప్పాలి.

వంద శాతం ఫలితాల దిశగా కసరత్తు

గతేడాది 73 శాతం ఫలితాలతో జిల్లా ఆరవ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది సమ్మేటివ్, ఫార్మేటివ్, డిసిఎబి ద్వారా కామన్ ఎగ్జామినేషన్, రెండు దఫాల పునశ్చరణ ప్రక్రియలు, నైట్‌విజన్, మోటివేషనల్ ప్రోగ్రామ్స్ నిర్వహణతో కూడిన ప్రణాళికను అమలు చేయడం ద్వారా వంద శాతం ఫలితాల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు విద్యాశాఖ పేర్కొనడం గమనార్హం. టెన్త్ ఫలితాల్లో ఫెయిల్డ్ శాతాన్ని బట్టి ఆయా ఎంఇఓలు, సబ్జె క్టుల్లో ఫెయిల్డ్ శాతాన్ని బట్టి ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేయడం ఏమేరకు ఫలితాలను ఇస్తుందో చూడాలి.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు యాక్షన్ ప్లాన్ అమలు చేశాం. జనవరి నుంచి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేయడంలో సఫలీకృతమయ్యాం. గతేడాది జిల్లా ఆరవ స్థానంలో నిలిచింది. ప్రస్తుత అకడమిక్ ఇయర్‌లో జిల్లా ర్యాంకు మెరుగుపడే అవకాశం ఉందనే ఆశాభావంతో ఉన్నాం.

- ఎ.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సమగ్రశిక్ష అభియాన్ అధికారి, కడప.

పులివెందులలో కాల్పుల కలకలం

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి అన్బురాజన్
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



కాల్పుల్లో మృతి చెందిన దిలీప్‌కుమార్, గాయపడిన మహబూబ్‌బాష

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

వైఎస్సార్ జిల్లా, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో మంగళవారం తుపాకీ కాల్పుల ఘటన కలకలం రేపింది. భరత్ కుమార్ యాదవ్ అనే వ్యక్తి తన తుపాకీ తీసుకొని ఇద్దరు వ్యక్తులపై నిర్దాక్షిణ్యంగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన చింతకుంట దిలీప్‌కుమార్(24)ను కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. రాగిపాటి మహబూబ్ బాషా అలియాస్ మస్తాన్ పులివెందులలోని ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్‌పి అన్బు రాజన్ కథనం మేరకు వివరాలిలా... భరత్ కుమార్ యాదవ్, పులివెందుల పట్టణంలోని గొర్రెల వ్యాపారి దిలీప్‌కుమార్ మధ్య ఆర్థికలావాదేవీలు ఉన్నాయి. వారం రోజులుగా ఇద్దరూ డబ్బుల విషయంలో గొడవపడుతుండేవారు. దిలీప్, భరత్‌కుమార్ యాదవ్‌కు అప్పు ఉండటంతో ఆ విషయంలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పులివెందులలోని వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో మధ్యాహ్నం ఇద్దరూ తీవ్రస్థాయిలో ఘర్షణ పడ్డారు. అక్కడి నుంచి హుటాహుటిన తన ఇంట్లోకి వెళ్లిన భరత్‌కుమార్ యాదవ్ తనవద్ద ఉన్న తుపాకీతో కాల్పులు జరిపాడు. దిలీప్ ఛాతిపై కాల్పులు జరిపాడు. ఆ సమయంలోనే అతడి పక్కనే ఉన్న దిలీప్ స్నేహితుడు మహబూబ్ బాషా అడ్డుకొనే ప్రయత్నం చేయగా అతడిపైనా కాల్పులు జరిపినట్లు బాధితులు చెబుతున్నారు. గాయాలతో వీరిద్దరూ ఆలయం మెట్ల వద్ద కింద పడిపోవడంతో భరత్‌కుమార్ యాదవ్ అక్కడి నుంచి తుపాకీతో పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో బాధితులను చికిత్స నిమిత్తం పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించారు. దిలీప్ పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా భరత్ కుమార్ యాదవ్ తుపాకీతో సహా పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.

వివేకా కేసులో భరత్‌ను విచారించిన సిబిఐ

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో పలుమార్లు సిబిఐ అధికారులు భరత్ కుమార్ యాదవ్‌ను విచారించారు. పలుమార్లు పత్రికా సమావేశం సమావేశాలు నిర్వహించి సిబిఐ అధికారులు, వివేకా కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేశారు. తనకు ప్రాణహాని ఉందని లైసెన్స్ గన్ పొందినట్లు తెలుస్తోంది. వివేకా కేసులో నిందితుడిగా ఉన్న సునీల్ కుమార్ యాదవ్‌కు భరత్ కుమార్ యాదవ్ స్వయాన సోదరుడు కావడం గమనార్హం.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి

పట్టణంలో కాల్పుల ఘటన తెలుసుకున్న ఎస్‌పి అన్బురాజన్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని సంఘటన జరిగిన తీరును, సంఘటనకు గల కారణాలను పులివెందుల డిఎస్‌పి శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు పిఆర్ డిఎస్‌పి రమణయ్య రిస్క్ టీం ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి భారీగా పోలీసులు మోహరించారు. పట్టణ సిఐ రాజు, రూరల్ సిఐ మద్దిలేటి, ఎస్ఐలు చిరంజీవి, మల్లికార్జున్‌రెడ్డి కూడా ఎస్‌పి వెంట ఉన్నారు.



ఘటనపై ఆరా తీస్తున్న ఎస్‌పి అన్బురాజన్

ప్రాధాన్యతా రంగాలు మరింత పటిష్టం కావాలి : కలెక్టర్

కడప : ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అన్ని ప్రాధాన్యతా రంగాలను మరింత పటిష్టం చేసి లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని విసి హాలులో ఆయా రంగాల్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు, పనుల పురోగతి, సాధించిన ప్రగతి తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. వ్యవసాయ శాఖ పరిధిలో జిల్లాలో విస్తృత సాగుబడిని పెంచడంతో పాటు అధిక దిగుబడులను సాధించేలా యాజమాన్య పద్ధతులను రైతులకు అవగా హన పెంచాలన్నారు. ప్రతి రైతు కూడా సాగుచేసే పంటలకు ఈ-క్రాప్ బుకిం గ్‌తో పాటు ఇకెవైసి ప్రక్రియను పూర్తి చేయించాలన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల ధాటికి దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాల అంచ నాలను పారదర్శకంగా నివే దించాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధి లోని ఆర్‌బికెల ద్వారా వ్యవ సాయ, ఉద్యాన రంగ సేవలను విస్తృతం చేయాల న్నారు. ఎపిఎంఐపి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సన్న, చిన్నకారు రైతులకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పశుసంవర్ధక శాఖను మరింత విస్తృతం చేయాలన్నారు. పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, గొర్రెలు, మేకల పెంపకందార్లను ఆర్థికంగా ముందుకు నడిపే సహాయ సహకారాలు అందిం చాలని తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ నైపుణ్య శిక్షణతో పాటు, పెట్టుబడి మొత్తాన్ని సహకరించాలన్నారు.

డిడి అచ్చెన్న మృతిపై త్రిసభ్య కమిటీ విచారణ

ప్రజాశక్తి - కడప అర్బన్



జెడితో మాట్లాడుతున్న త్రిసభ్య కమిటీ

పశుసంవ ర్ధకశాఖ డిడి అచ్చెన్న మృతి సంఘటనపై త్రి సభ్య కమిటీ విచారణ చేపట్టింది. మంగళవారం విజయవాడ నుంచి పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు సింహాచలం, జాయింట్ డైరెక్టర్ రత్నకుమారి, చిత్తూరు నుంచి వెంకటరావు కడపకు విచ్చేశారు. అచ్చెన్న హత్యకు తీసి దారి తీసిన పరిస్థితులు, ఇతర అంశాలపై జెడి శారదమ్మ, ఏడీలు సుధీర్ నాథ్ బెనర్జీ, శ్రీధర్ లింగారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సంఘటన మొదటి నుంచి డిడి అదృశ్యం వరకు ఏమి జరిగింది అనే దానిపై ఆరా తీశారు. **డాక్టర్ అచ్చెన్నకు అఖిలపక్షం అశ్రునివాళి:** పశుసంవర్ధక శాఖ కడప జిల్లా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్న పాశవిక హత్యకు గురికాబడడం దారుణమని వారి మృతికి సంతాపంగా అఖిలపక్ష నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. మంగళవారం సాయంత్రం కడపలో అంబేద్కర్ విగ్రహం సర్కిల్ వద్ద అఖిలపక్ష నాయకులు నిరసన చేపట్టారు. అచ్చెన్న హత్య పోలీసుల నిర్లక్ష్య పూరిత ప్రభుత్వ హత్యని పేర్కొన్నారు. దళిత అధికారి హత్యకు కారకులైన వారనందరిని కఠినంగా శిక్షించాలన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

కడప అర్బన్ : వైసిపి ప్రభుత్వంలోనే మహిళలకు పెద్ద పీట వేశారని ఉప ముఖ్యమంత్రి ఎస్ బి అంజాద్ బాషా అన్నారు. మంగళవారం మరియాపురం చర్చి ఆవరణలో నగరపాలక సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో 3వ విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో 'నవరత్నాలు' కార్యక్రమం ద్వారా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. **ఒంటిమిట్ట :** మండలంలోని వెలుగు కార్యాలయ ఆవరణం లో ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలకు విడుదలైన వైఎస్ఆర్ ఆసరా చెక్కులను మహిళలకు అందజేశారు. ఒంటిమిట్ట మండ లంలో 537 పొదుపు సంఘాలకు రూ.4. 79 కోట్లు, సిద్ధవటం మండలంలో 655 సంఘాలకు రూ.6. 18 కోట్లు లబ్ధి చేకూరిందని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. మెగా చెక్కులను లబ్ధిదారులకు వారు అందజేశారు.

చదువుతోపాటు నైపుణ్యం అవసరం

కడప అర్బన్ : విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు, పాటలు, మాటల్లో నైపుణ్యం పొందాలని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని శంకరాపురం స్కౌట్ ప్రాంతీయ కార్యాలయంలో మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు శిక్షణ నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక సేవ, దేశ భక్తి పెంపొందించడానికి స్కౌట్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. నాయత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా మంచి పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. స్కౌట్ సర్టిఫికెట్లు ఉన్న వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, అసిస్టెంట్ సెక్రటరీ శివప్రసాద్, ట్రెజరర్ రమణయ్య, ఎల్ఓసిలు జి.వెంకటేశ్వర్లు, శకుంతలమ్మ, శంకరమ్మ, ఎస్‌టిసిలు ఉమాదేవి, మోహన్ రావు, ఎస్ఓసిలు రజియా బేగం, శివప్రసాద్, రెండు జిల్లాల స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలి : జడ్జి

ప్రజాశక్తి- కడప

వేసవిలో పిల్లల ఆరోగ్య విషయాలు పట్ల జాగ్రత్తలు వహించాలని సీనియర్ సివిల్ జడ్జి కవిత సూచించారు. మంగళవారం అక్కాయపల్లిలోని ప్రాంతీయ బాలసదనాన్ని సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాలసదన్‌లో పిల్లలకు అందుతున్న వసతి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వంట, వసతి గదులను పరిశీలించారు. సాయంత్రం సమయంలో పిల్లలకు అందజేస్తున్న స్నాక్స్ పరిశీలించారు. భోజన సదుపా యాలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాంతీయ బాలసదన్ సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

గ్రామ స్థాయిలో వైద్యారోగ్య, ఐసిడిఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ.. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ సభాభవన్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్.నాగరాజుతో కలిసి జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహించే వైద్యాధికారులతో కలెక్టర్ వి.విజయ్ రామరాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్యాధికారులు క్రమం తప్పకుండా రోజూ విధిగా వారికి కేటాయించిన ఆరోగ్య కేంద్రాల్లో ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ వేయాలన్నారు. కింది స్థాయి సిబ్బందిని కూడా సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డా. హిమదేవి, డిప్యూటీ డిఎంహెచ్ఓలు, పీహెచ్సీలు, యూపీహెచ్ సీలు, సీహెచ్సీలు తదితర ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి గడ్డం జనార్ధనరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో మండల పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా సర్పంచులు, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మండల పరిధిలో ఉన్న పంచాయతీ సర్పంచ్‌తో కలిసి గ్రామసభలు ఏర్పాటు చేయాలని ఉపాధి హామీ పథకం కింద నాటిన చెట్లు ఎండిపోతున్నాయని సభ దృష్టికి సర్పంచ్ లక్ష్మీ నారాయణ రెడ్డి తీసుకొచ్చారు. స్పందిన ఎమ్మెల్యే చెట్లు ఎండిపోకుండా నీటి తడులు అం దించాలని ఎపిఒ భార్గవికి సూచించారు.

బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి- కలసపాడు

స్థానిక సెయింట్ ఆంటోనీస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఉగాది, శ్రీరామనవమి పండుగలను పురస్కరించుకొని నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థులకు మంగళవారం కరస్పాండెంట్ చిత్తా రాజేశేఖర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చిత్తా, ప్రభావతి , వ్యాయామ ఉపాధ్యాయులు, స్పోకెన్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాగ్రహానికి గురికాక తప్పదు

ప్రజాశక్తి- కడప

కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీ పట్ల కేంద్ర బిజెపి ప్రభుత్వం చారిత్రక తప్పిదం చేసిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ మండిపడ్డారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా ప్రతినిధి, పార్లమెంటు సభ్యులైన రాహుల్ గాంధీ పై తొందర పడి అనర్హత వేటు వేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతు ఉండకూడదనే ఉద్దేశంతో రాహుల్ గాంధీపై బహిష్కరణ వేటు వేశారని ఆరోపించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయిబాబా విద్యాసంస్థలలో ఘనంగా కాన్వకేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను క్రీడలు, సాంస్కృతి కార్యక్రమాలు, పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తూ ఆణిముత్యాలు తయారు చేస్తున్నామని తెలిపారు. వైస్ చైర్మన్ ఎం.వి సాయి సుధీర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కోవిడ్ సమయంలోనూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో విద్యార్థులను జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో పాల్గొనేలా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. సిఇఒ ఎంవి శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం మరువలేనిది అన్నారు. అనంతరం విద్యార్థులకు కాన్వగేషన్ ప్రదానం చేశారు.వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట



ఆలయ ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న పూజారి

శ్రీకోదండరామస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఈనెల 31 నుంచి ఏప్రిల్ 8 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ముందుగా కోయిల్ ఆళ్వార్ నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అర్చన నిర్వహించారు. అనంతరం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరు మంజనం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భాలయం, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీగరుత్మంతుని సన్నిధి, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పును నీటితో శుద్ధి చేశారు. 11.30 గంటల తరువాత స్వామి వారి దర్శనాన్ని భక్తులను అనుమతించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. **వాహన సేవలు :** ఈనెల 31న ధ్వజారోహణం, శేష వాహనంపై స్వామివారిని అలంకరిస్తారు. ఏప్రిల్ 1న హంసవాహనంపై వేణుగానాలంకారం, 2న సింహవాహనంపై వటపత్రశాయి అలంకారం, 3న హనుమత్సేవ వాహనంపై నవనీత కృష్ణాలంకారం, 5న మోహినీ అలంకారంలో గరుడ సేవ, 5న గజవాహనంపై శివదనుర్భంగాలంకారం, ఆ రోజే కల్యాణం నిర్వహిస్తారు. 6న రథోత్సవం, 7న అశ్వవాహనంపై కాళీయమర్దనాలంకారం, 8న చక్రస్నానం, అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలుంటాయి.

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

కడప : చిన్నపిల్లలు, గర్భిణులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ తప్పక పంపిణీ చేయాలని , విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ విజయ్‌రామరాజు హెచ్చరించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథక అమలుపై ఒఎస్‌డి రఘునాథ్, ఐసిడిఎస్ పీడీ రాణి, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం కింద పౌష్టికాహారం అందించాలన్నారు. అనిమియా నివారణకు గర్భిణులకు సరైన విధానంలో పౌష్టికాహారం పంపిణీ చేపట్టాలన్నారు. జిల్లాలో ఉన్న 4173 మంది గర్భిణులకు అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలన్నారు. ఈ ప్రక్రియలో ఎవరైనా అలసత్వం వహిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రోజూ టెలికాన్ఫరెన్సు ద్వారా సమీక్ష చేస్తానని అన్నారు. జీరో నుంచి ఆరు సంవత్సరాల లోపల పిల్లలందరికీ ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయించాలన్నారు.

జై భీమ్ పోస్టర్లు ఆవిష్కరణ

కడప : అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని జై భీమ్ మాల మహాసేన ఆధ్వర్యంలో వారోత్సవాల నిర్వహణ సందర్భంగా సందర్భంగా జై భీమ్ మాల మహాసేన అధ్యక్షుడు సంపత్, ప్రధాన కార్యదర్శి చైతన్య ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు ఆవిష్కరించారు.

రామకృష్ణారెడ్డి సేవలు అభినందనీయం

కడప అర్బన్ : సమాజహితమే తన అభిమతంగా నిత్యం సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్న వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ వి. విజయరామరాజు పేర్కొన్నారు. పదోతరగతి విద్యార్థులకు రామకృష్ణారెడ్డి రూపొందించిన కెరీర్ గైడెన్స్ పుస్తకాన్ని, తమ సంస్థ గౌరవ సలహాదారులు రాజోలి శ్రీధర్ రెడ్డి రూపొందించిన సంస్థ బ్రోచర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

గదికే పరిమితమైన 'ఉపాధి' బహిరంగ సమావేశం



స్త్రీశక్తిభవనంలో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

అట్లూరు : సాధారణంగా ఉపాధి హామీ చట్టం బహిరంగ సమావేశం ప్రజల సమక్షంలో బహిరంగ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. కానీ మండలంలో ఇందుకు పూర్తి విరుద్ధంగా స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేయడంతో పలు విమర్శలకు దారి తీసింది. మంగళవారం డ్వామా పీడీ యధుభూషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ సమావేశం గదిలో నిర్వహించడంతో ఫిర్యాదు దారులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఎండ వేడిమి తట్టుకోలేకనే స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేశామని ఎపిఎం చెప్పారు. ఇదీలా ఉండగా 2021 నుంచి 2022 ఏప్రిల్ 1 వరకు మండలంలో నిర్వ హించిన రూ. 7.22 కోట్ల పనులపై 15 రోజులుగా సామాజిక తనిఖీ బృందం పరిశీలించారు. అందుకు సంబంధించిన రికార్డులను పీడీ పరిశీలించారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తిచేయాలి : ఎస్‌పి

కడప అర్బన్ : పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌పి కె.కె. అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో డిఎస్‌పిలు, సిఐలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయా స్టేషన్ల ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ అతి తీవ్రమైన నేరాలను త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై ఛార్జ్ షీట్ దాఖలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాల్లో వాహన దారులను అప్రమత్తం చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలపై నేరాలు, రాబరీ, డెకాయిట్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. **30 మంది మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలు** బాల్య వివాహాలు అరికట్టడంలో, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో మహిళా పోలీసుల సేవలు అభినందనీయమని ఎస్.పి అన్బురాజన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఇటీవలి కాలంలో విధుల్లో అత్యుత్తమ పనితీరు కనబరచిన 30 మంది మహిళా పోలీసులను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు విధులు నిర్వర్తించాలని

రోడ్డు వెడల్పు పేరుతో పేదల ఇళ్లు కూల్చొద్దు

కడప అర్బన్ : రోడ్డు వెడల్పు పేరుతో కెసి కెనాల్ పరివాహక ప్రాంతంలో పేదల ఇళ్లు కూల్చవద్దని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మార్కింగ్ వేసిన ఇళ్లను టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.ఎ. సత్తార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి, డి.ఎం.ఓబులేసు, సిపిఐ నగర సహాయ కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, మల్లి, గౌస్ ఆర్‌సి పి మగ్బుల్‌బాష, బిఎస్‌పి గురప్ప, ఆమ్ ఆద్మీ డాక్టర్ శ్రీనివాసులు, సిపిఐ (ఎంఎల్) రాము, రమణ, ఎస్సీ ఎస్టీ, హ్యూమన్ రైట్స్ నాయకులు, బి.సి మహాసభ నాయకులు అవ్వారు మల్లికార్జున, ఆర్ఎఫ్ -దస్తగిరి, ఆవాజ్ ఫారూఖ్, హేతువాద సంఘ నాయకులు, సి ఆర్ వి ప్రసాద్, జమీల, తస్లీమా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు వెడల్పు చేయాల్సిన బళ్ళారి రోడ్డును వదిలేసి అక్కడ ధనవంతులు ఉన్నారని, వారికి ఎక్కువ స్థాయిలో నష్టపరిహారం ఇవ్వాల్సి వస్తుందని వైసిపి వారి ఒత్తిడి మేరకు కేసీ కెనాల్ పక్కగా 40 అడుగుల రోడ్డు వేయడానికి దాదాపు 75 ఇళ్లకు మార్కింగ్ వేశారని విమర్శించారు. అక్కడ ఉన్న వారంతా పేదలే అన్నారు. రూపాయిరూపాయి కూడబెట్టుకుని ఆ సొమ్ముతో రిజిస్ట్రేషన్ స్థలాలనుకొని ఇళ్లు నిర్మించుకున్నారని చెప్పారు. ఇప్పుడు ఆ రిజిస్ట్రేషన్లు చెల్లవని, అవి తప్పుడు సర్వే నంబర్లని 40 అడుగుల మేర రోడ్డు కోసం అధికారులు చెప్పటం అసమంజసంగా ఉందని చెప్పారు. అంతకంటే ముందు అప్పట్లో రిజిస్ట్రేషన్ చేసిన అధికారులను సస్పెండ్ చేయాలి, వారి నుంచే నష్టపరిహారం రాబట్టాలని డిమాండ్ చేశారు. పేదవారి కోసం ఎటువంటి న్యాయ పోరాటానికైనా సిద్ధపడతామని హెచ్చరించారు. త్వరలో ఈ విషయమై అఖిలపక్ష కమిటీ నాయకత్వంలో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యక్రమాన్ని రూపొందిస్తామని తెలిపారు.

అనాథ వృద్ధులకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. మాజీ పిసిసి అధ్యక్షుడు శైలజానాథ్ పుట్టిన రోజు సందర్భంగా ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధ్రువకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. వృద్ధులకు అల్పాహారం ఇచ్చారు. చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధ్రువకుమార్‌రెడ్డి మాట్లాడుతూ శైలజానాథ్ పుట్టిన రోజు అనాథ వృద్ధుల మధ్య చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, చెన్నకేశవ, ఉత్తన్న, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్, వేంపల్లె ఎస్‌సి సెల్ అధ్యక్షుడు వెంకటేష్ బాబు, జిల్లా కార్యదర్శి వేమయ్య, అమర్, శివయ్య, నాగార్జున, బొల్లి పవన్‌కుమార్, ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న ధ్రువకుమార్‌రెడ్డి

రక్తగ్రూపు తెలుసుకుంటే ప్రయోజనం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రతి ఒక్కరూ తమ రక్త గ్రూపు తెలుసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలున్నాయని కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్. వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. మీనాపురం గ్రామంలో శిబిరంలో భాగంగా రక్త నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ రక్త గ్రూపు తెలుసుకోవడం వల్ల అత్యవసరమైన సమయంలో గర్భిణులు, ఆపరేషన్లు చేయించుకునే వారికి, ప్రమాదాలకు గురైన వారికి వెంటనే రక్తం ఇవ్వవచ్చన్నారు. దాదాపు 150 మందికి రక్త నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి, బయో టెక్నాలజీ అధ్యాపకురాలు సూర్యకాంతి, కెమిస్ట్రీ అధ్యాపకులు సురేంద్రనాథ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.


రక్త నిర్ధారణ పరీక్ష చేయించుకుంటున్న సర్పంచ్

సిబిఐటి కళాశాలలో రక్తదానం

చాపాడు : స్థానిక సిబిఐటి కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకారంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ కవిత పర్యవేక్షణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిబిఐటి అధ్యాపకులు, విద్యార్థులు దాదాపు 148 మంది రక్తదానం చేశారు. రక్తదాన శిబిరాలను తమ కళాశాలలో గతంలో పలుమార్లు నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి వివరిస్తూ, విద్యార్థుల్లో ఉన్న సేవా గుణాన్ని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

టిడిపి బలోపేతానికి మరింత కృషి చేయాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సూచించారని ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హైదరా బాదులోని ఎన్‌టిఆర్ భవన్‌లో మంగళవారం ఆయన చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంపై చంద్ర బాబు మాట్లాడారని అన్నారు. పార్టీ బలోపేతానికి క్లస్టర్, యూనిట్, బూత్ లెవెల్ ఇన్‌చార్జి కష్టపడాలని సూచించారన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పాటుపడే ప్రతి కార్యకర్తకు తాను వెన్నుదన్నుగా నిలుస్తానని హామీ ఇచ్చారన్నారు. 2024 ఎన్నికల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో టిడిపి అడుగులు వేస్తోందన్నారు.


చంద్రబాబును కలిసిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పగులుగొట్టారు. ఇందుకు కారకులైన దుండగులను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని సీతారామాపురం గ్రామానికి చెందిన ప్రజలు మంగళవారం తహశీల్దార్ సుభానికి వినతిపత్రమిచ్చారు. ఆంజనేయ స్వామి విగ్రహం చేతులు, చప్పట పాక్షికంగా ధ్వంసం చేశారు. సంఘటనపై వెంటనే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నందివర్ధన ఆచారి, భాస్కర్‌రెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతకు మొక్కలు అవసరం

ప్రజాశక్తి - వేంపల్లె


పర్యావరణ సమతుల్యతకు మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి తెలిపారు. స్థానిక దళితవాడ ప్రాంతాల్లో మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ రూపంలో పొంచి ఉన్న ముప్పును గుర్తించకపోతే భావితరాల మనుగడకు కష్టమవుతుందన్నారు. కాలుష్యాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా కృషి చేయాలన్నారు. పర్యావరణ వ్యవస్థలో మొత్తం సమతుల్యతను కాపాడుకోవడంలో మొక్కలు కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మల్లేశ్వరమ్మ, శ్రీకాంత్‌రెడ్డి, వినోద్, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించండి

- మరుగుదొడ్ల నీరు వ్యవసాయ భూముల్లోకి.. వేధిస్తున్న దోమలు, పందుల బెడద

ప్రజాశక్తి - ముద్దనూరు

తాడిపత్రి–జమ్మలమడుగు 67వ జాతీయ రహదారికి పోవు రోడ్డులో ముద్దనూరులోని ఉమ్మారెడ్డిపల్లె మలుపు వద్ద ఏర్పాటైన అక్రమ నిర్మాణాలు, మరుగుదొడ్లు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. మరుగుదొడ్ల నుండి వచ్చే మురుగు నీరు రోడ్డుకు చెందిన స్థలంలో వ్యవసాయ భూముల్లోకి వస్తున్నాయని వారు వాపోతున్నారు. మురుగునీరు నిల్వ ఉండడంతో పందుల సంచారం ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్రత వల్ల దోమలు, పందుల బెడద తీవ్రంగా వేధిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దోమ కాటుకు, దుర్వాసనకు రోగాల బారినపడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. అక్రమ నిర్మాణాలపై స్థానిక తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలు, మరుగుదొడ్లు తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన భూమిలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



అక్రమంగా వెలసిన నిర్మాణాలు, మరుగుదొడ్లు

విద్యుత్ ఛార్జీల కొత్త తరహా బాదుడు ఆపాలి


మాట్లాడుతున్న శివనారాయణ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యుత్ ఛార్జీల కొత్త తరహా బాదుడును ఆపాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి శివ నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నేరుగా ప్రజలపై వేసే కరెంట్ భారాలు కాకుండా కొత్త తరహా భారాలు మోపేందుకు సిద్ధమవుతున్నాయన్నారు. విద్యుత్ (రైట్ ఆఫ్ కన్స్యూమర్) సవరణ రూల్స్ 2023 ముసాయిదాను కేంద్రం తీసుకొచ్చిందన్నారు. ఏప్రిల్ 14లోపు అభిప్రాయాలు చెప్పాలని రాష్ట్రాలను కోరిందన్నారు. రాష్ట్రాల అభిప్రాయాల అనంతరం ప్రజలపై కొత్త తరహా కరెంట్ ఛార్జీల రూపంలో భారాలు పడబోతున్నాయన్నారు. డిస్కంలు గృహ, వాణిజ్య విద్యుత్ కనెక్షన్ ఇచ్చే టప్పుడు వాడుకునే విద్యుత్ పరికరాల ఆధారంగా లోడ్‌ను నిర్ణయి స్తారన్నారు. కరెంట్ ఛార్జీల కొత్త తరహా భారాలు మోపేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించాలని ఆయన కోరారు. ఇందుకు వ్యతిరేకంగా సిపిఎం ప్రజలను కలుపుకొని పోరాటాలు చేస్తుందన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు హాజీ, కృష్ణారెడ్డి, నాగేష్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు నడుచుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్ వేలం పాటను మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటరమణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో 10మంది పాల్గొనగా అత్యధికంగా రూ.1.28 కోట్లకు శుభాన్ అనే వ్యక్తి దక్కించుకున్నాడు. గతంలో రూ.1.06 కోట్లకు పలకగా, ఈ ఏడాది అదనంగా రూ.22 లక్షలు మున్సిపాలిటీ ఆదాయం పెరిగింది. ఇది కాకుండా జిఎస్‌టి 18 శాతం అదనంగా ఉంటుంది. అనంతరం కమిషనర్ వెంకటరమణయ్య మాట్లాడుతూ మున్సిపల్ నియమ నిబంధనల మేరకు నడుచుకోవాలని, అలా కాకుండా విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని సూచించారు.

జమ్మలమడుగు : జమ్మలమడుగు పురపాలక సంఘం దిన కూరగాయల మార్కెట్, బస్టాండ్, బండ్లమిట్ట, కబేలా 2023–24కు సంబంధించి ఫీజు వసూలు చేసుకునే గుత్త హక్కును ఇచ్చుటకు మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అధికారులు వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో దిన కూరగాయల మార్కెట్ సంవత్సరానికి రూ.13,50,000 పి.మహేశ్వర్‌రెడ్డి దక్కించుకున్నారని మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బస్టాండ్ రూ.5,66,000కు వి.రామలక్ష్మమ్మ, బండ్లమేట్ట ఏడాదికి రూ.4,88,000 ఆర్.సుధాకర్‌రెడ్డి, కబేలా రూ.2,11,000 కె.షరీఫ్ నిషా బేగం దక్కించుకున్నారు. 2023–24 సంవత్సరానికిగానూ గుత్తల ద్వారా నగర పంచాయతీకి రూ.26,15,000 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో సుభాన్‌తో ఒప్పంద సంతకాలు చేయిస్తున్న అధికారులు

వైఎస్ఆర్ ఆసరాతో మహిళలకు లబ్ధి : ఎమ్మెల్యే



మహిళలకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వైఎస్ఆర్ ఆసరా ద్వారా మహిళలకు లబ్ధి చేకూరడం హర్షణీయమని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. వైఎస్ఆర్ ఆసరా చెక్కులను పొదుపు సంఘాల మహిళలకు మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని కొనియాడారు. మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు మంగళవారం ఆయన అందజేశారు. మొత్తం 1196 పొదుపు సంఘాలు ఉండగా, అందులో మున్సిపాలిటీ పరిధిలో 497, రూరల్ పరిధిలో 699 గ్రూపులకు సంబంధించి రూ.10 కోట్ల 92 లక్షల 41వేల 447 వారి ఖాతాలో జమ చేశామన్నారు. మున్సిపల్ చైర్మన్ హర్ష వర్ధన్‌రెడ్డి, జడ్‌పిటిసి బాలయ్య, కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, సర్పంచులు, మున్సి పల్ కమిషనర్ జగన్నాథ్, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని యువతిని తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలో కొన్ని రోజుల నుంచి మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న లక్ష్మీప్రసన్నను మంగళ వారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ చిరంజీవి సమక్షంలో ఆమె తండ్రి, బంధువులకు అప్పగించారు. పోలీసుల వివరాల మేరకు.. కొన్ని రోజుల క్రితం స్థానిక కడప రోడ్డులో అర్ధరాత్రి ఒంటరిగా తిరుగుతున్న మతిస్థిమితం లేని యువతిని ట్రాఫిక్ ఎస్ఐ హాజీవల్లి గమనించి స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజుకు తెలిపారు. నైట్ షెల్టర్ మేనేజర్ ఓబన్నతో మాట్లాడి అక్కడ చేర్పించారు. మతిస్థిమితంలేని యువతి పులివెందులలో ఉన్నట్లు ఎవరైనా గుర్తించండి అని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. ఆ యువతి తల్లిదండ్రులు, బంధువులు రాజును ఫోన్‌లో సంప్రదించారు. ఆ యువతి పేరు లక్ష్మీ ప్రసన్న అని, మతిస్థిమితంలేని కారణంగా ఇల్లు విడిచి ఇక్కడకి చేరుకుందని యువతి తండ్రి రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసన్న తండ్రి, బంధువులు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.


తల్లిదండ్రుల చెంతకు చేరిన లక్ష్మీ ప్రసన్న

'స్పందన' తప్పక నిర్వహించాలి

ప్రజాశక్తి - చాపాడు

సచివాలయాల పరిధిలో ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అల్లాడుపల్లె సచివాలయంలో స్పందన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే అర్జీలను సిబ్బంది స్వీకరించి సంబంధిత శాఖ సిబ్బంది వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని రికార్డులో నమోదు చేయాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో ఎక్కడికి వెళ్ళేది రికార్డులో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ శ్రీధర్‌నాయుడు

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి - ముద్దనూరు

సిఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా అని మాజీ ఎంపిపి ముని రాజారెడ్డి అన్నారు. స్థానిక తన నివాసం వద్ద మంగళవారం ముని రాజారెడ్డి ఆధ్వర్యంలో ఉప్పులూరు గ్రామానికి చెందిన చాముండికి సిఎం రిలీఫ్ ఫండ్ రూ.1లక్ష 35వేలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రకాల జబ్బులతో అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన భాదితులకు సిఎం సహాయ నిధి ఒక వరం అన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహాయ సహకారాలతో బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులు విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గురప్ప, నాయకులు బాల వీరయ్య, కో –ఆప్షన్ సభ్యులు ఖదీర్‌బాషా పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి

ప్రాంతీయ పార్టీల మౌనం దురదృష్టకరం

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాహుల్ గాంధీపై అనర్హత వేటుపై రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు వైసిపి, టిడిపి, జనసేన నాయకుల మౌనం దురదృష్టకరమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీపై వేసిన అనర్హత వేటుపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోందన్నారు. కాంగ్రెసు పార్టీకి ఆయా రాష్ట్రాల్లో రాజకీయ ప్రత్యర్థి అయినప్పటికీ ఆమ్‌ఆద్మీ పార్టీ, సమాజ్ వాది పార్టీ, తృణమూల్ కాంగ్రెసు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ ఉదంతంపై బిజెపి అప్రజాస్వామిక, రాజకీయ కక్ష సాధింపు చర్యలను ఖండించారన్నారు. ఎపిలో జగన్, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ బిజెపి అప్రజాస్వామిక రాజకీయ కక్ష సాధింపు చర్యలను ఖండించలేదన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసు, క్విడ్ ప్రో కేసులు, కోడి కత్తి కేసు అంశాల వల్ల జగన్‌కు బిజెపిని విమర్శించాలంటే కొంత ఇబ్బంది ఉండవచ్చు అన్నారు. కానీ రోజూ ప్రజాస్వామ్యం, రాజకీయ కక్ష సాధింపులపై ఉపన్యాసాలిచ్చే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాట్లాడక పోవడం శోచనీయమని విమర్శించారు. రాష్ట్రంలో బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అని పేర్కొన్నారు.

ఎస్‌సి జాబితాలో చేర్చిన వారికే ఓట్లు

- రజక వెల్ఫేర్ అసోషియేషన్ కో-ఆర్డినేటర్ గౌరిశంకర్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చిన వారికే తమ ఓట్లు వేస్తామని రజక వెల్ఫేర్ అసోషియేషన్ కో–ఆర్డినేటర్ గౌరీ శంకర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల రజకులను ఎస్‌సి జాబితాలో నమోదు చేయాలని డిమాండు చేస్తూ ఢిల్లీలో సంఘం నాయకులు చేసిన నిరసనకు మంచి స్పందన వచ్చిందన్నారు. టిడిపి ఎంపిలు, పలు పార్టీల నాయకులు కూడా మద్దతిచ్చారన్నారు. 2008లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రజకులను ఎస్‌సి జాబితాలో చేరుస్తామని హైదరాబాదులో హామీ ఇచ్చారన్నారు. 2014లో టిడిపి తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశాన్ని చేర్చి త్రిసభ్య కమిటీ వేసిందన్నారు. పాదయాత్ర సమయంలో ఈ అంశాన్ని సంఘం నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. అధికారంలోకి వచ్చార రజకులను పూర్తిగా పట్టించుకోలేదన్నారు. దీనిపై వారంలోపు అన్ని ప్రాంతాల కలెక్టర్లు, తహశీల్దార్‌లకు వినతిపత్రాలు సమర్పించాలని సంఘం నాయకులకు పిలుపునిచ్చారని తెలిపారు.

నేడు వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

వైఎస్సార్ ఆసరా మూడవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం స్థానిక వైఎస్ కల్యాణమండపంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిపి టి.లక్షుమయ్య తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరవుతారని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు హాజరుకావాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

'లిప్' విజయవంతానికి సంసిద్ధం కావాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకబోధన చేపట్టే లిప్ కార్యక్రమం ఈనెలాఖరుకు ముగుస్తుందని, వచ్చే విద్యా సంవత్సరం మళ్లీ ప్రారంభమవుతుందని, విజయవంతానికి ఉపాధ్యాయులు సంసిద్ధులై ఉండాలని మానిటరింగ్ అధికారి లక్ష్మీనారాయణ కోరారు. మంగళవారం పులి వెందుల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, యర్రగుడిపల్లిలో లిప్ పర్యవేక్షణ కొనసాగింది. ఆ మేరకు ఆయన ఎం–3 మానిటరింగ్ చేసి రికార్డులను, సాధనా పీరియడ్లను పరిశీలించారు. అనంతరం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సహాయ సహకారాలతో లిప్ కార్యక్రమం విజయవంతమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

కల్వర్టు ఏర్పాటులో నిర్లక్ష్యం తగదు

- డివైఎఫ్ఐ నాయకులు ఎల్లయ్య, ప్రసాద్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రొద్దుటూరు రోడ్డులోని జడ్‌పి మార్కెట్ హైస్కూల్ కాలువపై కల్వర్టు నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్య వైఖరి తగదని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య, పట్టణ ఉపాధ్యక్షులు కాటిగాళ్ల ప్రసాద్ తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ నాలుగు నెలల నుండి యువజన సంఘం ఆధ్వర్యంలో అధికారులకు విన్నవించినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఏప్రిల్ 3 నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ కూడా ఆ స్కూల్‌లో ఉందన్నారు. విద్యార్థులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్నందున కల్వర్టు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పరీక్ష కేంద్రాలను కూడా అధికారులు సరైన రీతిలో కేటాయించలేదన్నారు. జడ్‌పి మార్కెట్ హైస్కూల్‌లో ఒక్క ప్రయివేట్ స్కూల్ విద్యార్థులకు మాత్రమే పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారని, ఇది ప్రజల్లో, తల్లిదండ్రుల్లో అనేక అనుమానాలను రేకిస్తోందన్నారు. ఆ స్కూల్‌లో నాడు–నేడు పనులు జరుగుతున్నాయన్నారు.